


sahanamvande.com epaper.sahanamvande.com


# సహనం వందే

హైదరాబాద్ | 14-06-2026 ఆదివారం | సంపుటి-02 సంచిక : 78 EDITOR: ROHINI




# లవర్ బాయ్స్... క్రైమ్ హీరోస్

## ప్రేమ వల విసురుతున్న నైజీరియన్ యాహూ బాయ్స్




- సైబర్ సెలబ్రిటీస్... హోదాగా మారిన క్రైమ్
- జైలుకు వెళ్లాల్సిన దొంగలకు లక్షల్లో ఫాలోవర్స్
- చదువులు పక్కన పెట్టి.. మోసాల బాట పట్టి
- రాత్రికి రాత్రే నోట్ల పంట... లగ్జరీ లైఫ్‌కు బాట!
- సామాజిక హోదాగా నేరం... కార్లోస్ పుస్తకం
- తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగా సైబర్ దోపిడి

**సైబర్ నేరాలు ఇప్పుడు మోసాలు కావు. రాత్రికి రాత్రే కోటీశ్వరులను చేసే మంత్రదండాలుగా మారాయి. నైజీరియా యువతను ఊపేస్తున్న యాహూ బాయ్స్ సంస్కృతిపై కార్లోస్ బరాగన్ రాసిన కొత్త పుస్తకం సంచలన విషయాలను బయటపెట్టింది. ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన సొమ్ముతో లగ్జరీ జీవితాన్ని గడుపుతున్న వైనం ప్రపంచాన్ని షాక్‌కు గురిచేస్తోంది. తెలుగు రాష్ట్రాలతో ప్రపంచవ్యాప్తంగా వీరి దోపిడీ విస్తరించి పోయింది. - సహనం వందే, హైదరాబాద్**

ఈ అంతర్జాతీయ మోసాల సామ్రాజ్యం ఎంత పెద్దదో చూస్తే గుండె గుభేల్ మంటుంది. 2025 సంవత్సరంలో వారి మోసాల విలువ ఏకంగా 37.12 లక్షల కోట్ల రూపాయలు. ఏఐ, డీప్‌ఫేక్స్ సాంకేతికతతోనే ఈ స్థాయి దోపిడీ జరిగింది. వివిధ భాషల్లో అప్పటికప్పుడు అనువాదం చేసే యాప్ లు నేరగాళ్లకు వరంగా మారాయి. ఇంటర్నెట్‌లో లభించే ఫ్రాడ్ యాజ్ ఏ సర్వీస్ సాఫ్ట్‌వేర్ సాయంతో ఈ నేరాలు రూపాంతరం చెందుతున్నాయి. పెట్టుబడుల పేరిట, ఈకామర్స్ పేరిట దోపిడీలు సాగుతున్నాయి. తప్పుడు రుణాల యాప్‌లు కూడా ఇందుకు వేదికగా మారుతున్నాయి.

### యాహూ బాయ్స్ నెట్‌వర్క్

నైజీరియాలో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే క్రిమినల్స్ ప్రపంచవ్యాప్తంగా యాహూ బాయ్స్ అనే పేరుతో చలామణిలో ఉన్నారు. వీరు విదేశీయులను బురిడీ కొట్టించి భారీగా సంపాదిస్తున్నారు. ఇంటర్నెట్లో అమాయకులను వలలో వేసుకుని బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న ఘోరమైన ప్రేమ దోపిడీ వెనుక నైజీరియాకు చెందిన యాహూ బాయ్స్ నెట్‌వర్క్ ఉంది. శృంగార దోపిడీని ఒక పెద్ద పరిశ్రమగా మార్చేశారు.

### హోదాగా మారిన క్రైమ్

సాధారణంగా నేరస్థులు సమాజంలో తలదించుకుంటారు. కానీ ఇక్కడ సీన్ పూర్తిగా రివర్స్ అయ్యింది. సైబర్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బుతో వీరు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. నైజీరియా సమాజంలో వీరికి ప్రత్యేక గౌరవం లభిస్తోంది. ఆన్‌లైన్ దగా ద్వారా వచ్చిన సంపద వీరికి విపరీతమైన పరపతిని తెచ్చిపెడుతోంది. ఖరీదైన కార్లు, దుస్తులు, బంగ్లాలు, బంగారు గొలుసులు, బ్రాండెడ్ వస్తువులతో లగ్జరీ లైఫ్ అనుభవిస్తున్నారు. కష్టపడకుండా తక్కువ సమయంలోనే కోట్లకు పడగలెత్తే ఈ విధానాన్ని యువత ఒక ఫ్యాషన్‌గా భావిస్తోంది. చదువుకున్న వారే కాకుండా చదువురాని వారు కూడా ఈ ఆన్‌లైన్ దందాలోకి ఈజీగా అడుగుపెడుతున్నారు.

### సోషల్ మీడియాలో లక్షలాది ఫాలోవర్స్

యాహూ బాయ్స్ సంపాదిస్తున్న అక్రమ సొమ్ము వారిని రాత్రికి రాత్రే సెలబ్రిటీలుగా మారుస్తోంది. సోషల్ మీడియాలో వీరికి లక్షలాది మంది ఫాలోవర్స్ ఉంటున్నారు. తాము చేసే మోసాలను దాచుకోకుండా బహిరంగంగానే ప్రదర్శిస్తున్నారు. ఈ డబ్బుతోనే వారు పాపులారిటీని, అధికారాన్ని శాసిస్తున్నారు. శ్రమపడి సంపాదించడం కంటే ఈ సులువైన మోసాల వైపే నైజీరియా యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నట్లు పరిశోధనలో తేలింది.

### రాజకీయాలను శాసిస్తున్నారు...

ఈ స్కామర్స్ కేవలం డబ్బుతోనే ఆగడం లేదు. స్థానిక రాజకీయాలను, వ్యాపారాలను సైతం శాసిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో వీరు సంబంధాలు కలిగి ఉంటున్నారు. మోసపూరిత డబ్బుతో సమాజంలో ఒక బలమైన నెట్‌వర్క్ నిర్మించుకున్నారు. ఆన్‌లైన్ ఫ్రాడ్ అనేది ఒక వ్యవస్థీకృత పరిశ్రమగా రూపాంతరం చెందింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సైబర్ భద్రతా సంస్థలకు ఈ యాహూ బాయ్స్ ఇప్పుడు పెద్ద సవాలుగా నిలుస్తున్నారు.




### ప్రపంచాన్ని వణికిస్తున్న నెట్‌వర్క్

ఈ గ్యాంగ్‌ల విస్తృతి ఇప్పుడు ప్రపంచానికి పెద్ద ముప్పుగా మారింది. వివిధ దేశాల ధనవంతులను టార్గెట్ చేస్తూ రొమాన్స్ స్కామ్స్, బిజినెస్ ఈమెయిల్ కాంప్రమైజ్ వంటి మోసాలకు పాల్పడుతున్నారు. నేరం ద్వారా సంపద, కీర్తి లభిస్తుండటంతో నైజీరియాలో నైతిక విలువలు పతనమవుతున్నాయి. కష్టపడి చదువుకునే వారి కంటే మోసాలు చేసేవారే సమాజంలో హీరోలుగా చెలామణి అవ్వడం ఒక పెద్ద సామాజిక సంక్షోభానికి దారితీస్తోంది.

# మొండి గోడలకు ఇంటికి అద్దె

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో పెద్ద స్కామ్

- డబ్బులు లేని చిన్న బిల్డర్ల సరికొత్త జిమ్మిక్కు
- ఈఎంఐ లేదంటూ మాయ... ఆఫర్లతో మోసం

**రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త వ్యాపార వ్యూహాలు కలకలం రేపుతున్నాయి. ఇల్లు చేతికి రాకముందే అద్దె ఇస్తామంటూ బిల్డర్లు వేస్తున్న ఎర వెనుక భారీ ఆర్థిక మాయాజాలం దాగి ఉంది. ఈ సరికొత్త ప్రీ-పొసెషన్ రెంట్ మోసాల అసలు రంగును ఇప్పుడు చూద్దాం. - సహనం వందే, హైదరాబాద్**



హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొద్దిరోజులుగా సరికొత్త ఆఫర్లు హల్‌చల్ చేస్తున్నాయి. స్వాధీనానికి ముందే అద్దె చెల్లిస్తామంటూ బిల్డర్లు సరికొత్త మోసపూరిత ప్రకటనలతో మార్కెట్లోకి వచ్చారు. స్వాధీనం వరకు ఈఎంఐ కట్టాల్సిన అవసరం లేదంటూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. అష్యూర్డ్ రెంటల్ స్కీమ్స్ పేరుతో నమ్మబలుకుతూ మధ్యతరగతిని బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ఆఫర్ల వెనుక ఉన్న లోతైన ఆర్థిక నష్టాలను సామాన్యులు గమనించలేకపోతున్నారు.

### టియర్ వన్ బిల్డర్ల నమ్మకమైన పునాది

ఈ తరహా ప్రకటనలు చూసి మోసపోకుండా ఉండాలంటే బిల్డర్ల చరిత్రను పూర్తిగా పరిశీలించాలి. మీరు సంప్రదించే సంస్థ టియర్ వన్ కేటగిరీకి చెందినదైతే కొంతవరకు సురక్షితం కావచ్చు. గతంలో ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి నమ్మకమైన చరిత్ర గల బిల్డర్లతోనే ఇటువంటి ఒప్పందాలు చేసుకోవాలి. అటువంటి పెద్ద సంస్థలు అందించే ముందస్తు అద్దె పథకాలు పెట్టుబడిదారులకు మంచి ఆర్థిక సాధనంగా ఉపయోగపడతాయి. అయితే మార్కెట్లో అందరూ అటువంటి వారు లేరనేది పచ్చి నిజం.

### చిన్న బిల్డర్లలో ఆర్థిక సంక్షోభం

మార్కెట్లోకి కొత్తగా వచ్చిన చిన్న బిల్డర్లు లేదా నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న డెవలపర్లు ఈ పథకాలను మోసపూరితంగా వాడుకుంటున్నారు. ప్రాజెక్టు పూర్తి చేసే సత్తా లేక ఇలాంటి ఉచితాల ఎర వేస్తున్నారు. ఈ చిన్న బిల్డర్ల నమ్మకత్వంపై ఎలాంటి ఆధారాలు ఉండవు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బిల్డర్లు కస్టమర్ల నుంచి ముందస్తుగా డబ్బులు లాగడానికే ఇటువంటి జిమ్మిక్కులు ప్లే చేస్తున్నారు. వీరి ట్రాప్‌లో పడితే అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉంది.

### మీ డబ్బుతోనే మీకు చెల్లిస్తున్న అద్దె మాయ

బిల్డర్లు ఎవరూ ఉచితంగా డబ్బులు ఇవ్వరనేది జగమెరిగిన సత్యం. రాబోయే 2 లేదా 3 ఏళ్లలో మీకు చెల్లిస్తామన్న మొత్తం అద్దెను ముందే లెక్కగడుతున్నారు. ఆ మొత్తాన్ని అపార్ట్‌మెంట్ బేస్ సెల్లింగ్ ప్రైస్‌కు అదనంగా కలిపేస్తున్నారు. అంటే మీ జేబులో నుంచి తీసుకున్న డబ్బులనే మీకు ప్రతి నెలా అద్దె రూపంలో తిరిగి ఇస్తున్నారు. కొనుగోలుదారులు తమ సొంత డబ్బుతోనే ఈ ముందస్తు అద్దె స్కీమ్‌కు తామే పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నారనే విస్తుపోయే నిజం ఇక్కడ దాగి ఉంది.

### అసలు మోసం ఎలా జరుగుతుందంటే?

ఈ మోసాన్ని అర్థమయ్యేలా ఒక ఉదాహరణతో చూద్దాం. ఒక అపార్ట్‌మెంట్ అసలు ధర 50 లక్షల రూపాయలు అనుకుందాం. బిల్డర్ మీకు ఇల్లు కట్టకముందే నెలకు 20 వేల రూపాయల చొప్పున 3 ఏళ్ల పాటు అద్దె ఇస్తానని ఆఫర్ ఇస్తాడు. అంటే 3 ఏళ్లకు కలిపి మొత్తం 7 లక్షల 20 వేల రూపాయలు మీకు అద్దెగా ఇస్తాడు. కానీ బిల్డర్ తెలివిగా ఆ 50 లక్షల అపార్ట్‌మెంట్ ధరను 57 లక్షల 20 వేల రూపాయలుగా నిర్ణయిస్తాడు. అంటే మీ దగ్గరే అదనంగా డబ్బులు వసూలు చేసి మీ డబ్బునే మీకు అద్దెగా ఇస్తున్నాడు.

### నో ఈఎంఐ టిల్ పొసెషన్ అంటూ...

కొందరు బిల్డర్లు నో ఈఎంఐ టిల్ పొసెషన్ అంటారు. అంటే ఇల్లు మీ చేతికి వచ్చేవరకు బ్యాంకు లోన్ ఈఎంఐను బిల్డరే కడతానని నమ్మిస్తాడు. ఇక్కడ కూడా సదరు ఈఎంఐ మొత్తాన్ని ముందే ఫ్లాట్ ధరలో కలిపేసి మీ నెత్తిన భారం వేస్తాడు. ఒక చిన్న బిల్డర్ అష్యూర్డ్ రెంటల్ స్కీమ్ ప్రకటించి మధ్యలోనే చేతులెత్తేస్తే పరిస్థితి దారుణంగా మారుతుంది. ఫ్లాట్ ధర పెంచి వసూలు చేసి ప్రాజెక్ట్ పూర్తి చేయకుండా పారిపోతే అటు ఇల్లు రాక ఇటు అద్దె రాక సామాన్యుడు రోడ్డున పడతాడు.

# వేల కోట్ల ఆటగాళ్లు

## ఫుట్‌బాల్ ఆటగాళ్ల నోట్ల వేట

- ఏడాదికి 2505 కోట్లతో రొనాల్డో టాప్ గేర్
- 1169 కోట్ల రూపాయలతో మెస్సీ రెండో ప్లేస్
- 22 ఏళ్ల జూడ్ బెల్లింగ్‌హామ్ కు 368 కోట్లు
- మైదానంలో పైసల వరద... ఫోర్బ్స్ జాబితా

**ప్రపంచ కప్ ఆడుతున్న సాకర్ వీరుల జేబులు ఎలా నిండుతున్నాయో తెలిస్తే మైండ్ బ్లాంక్ అవ్వడం ఖాయం. ఇది కేవలం ఈ ఒక్క టోర్నమెంట్ సంపాదన కాదు. క్లబ్ మ్యాచుల వార్షిక జీతాలు, ప్రపంచవ్యాప్త బ్రాండ్ల ప్రకటనల ద్వారా ఈ ఏడాది వీరు అందుకుంటున్న మొత్తం వార్షిక ఆదాయం. ఈ ఏడాది ప్రపంచ కప్‌లో బరిలోకి దిగుతున్న అత్యధిక పారితోషికం కలిగిన టాప్ 11 మంది ఆటగాళ్ల పూర్తి ఆదాయ వివరాలను ఫోర్బ్స్ సంస్థ లెక్కగట్టింది. - సహనం వందే, హైదరాబాద్**



క్రిస్టియానో రొనాల్డో..

ఈ సంపాదన వేటలో పోర్చుగల్ కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో అందరికంటే ముందంజలో ఉన్నాడు. 41 ఏళ్ల రొనాల్డో మొత్తం ఏడాది ఆదాయం 2505 కోట్ల రూపాయలుగా నమోదైంది. మైదానంలో ఆట ద్వారా ఆయనకు లభించే వేతనం 1962 కోట్లు. మైదానం బయట బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, ప్రకటనల ద్వారా 543 కోట్ల రూపాయలు వస్తున్నాయి. ప్రపంచ కప్‌లో ఆడుతున్న అత్యధిక సంపాదన కలిగిన బిలియనీర్ కెప్టెన్లలో రొనాల్డో ప్రథమ స్థానంలో నిలిచాడు.

### అదే దూకుడులో మెస్సీ

అర్జెంటీనా స్టార్ 38 ఏళ్ల లియోనెల్ మెస్సీ 1169 కోట్ల రూపాయల వార్షిక సంపాదనతో రెండో స్థానంలో నిలిచాడు. మెస్సీ మైదానంలో ఆట ద్వారా 584 కోట్లు సంపాదిస్తున్నాడు. అంతే మొత్తాన్ని అంటే మరో 585 కోట్ల రూపాయలను మైదానం బయట ప్రకటనల ద్వారా వెనకేస్తున్నాడు. ఇంటర్ మయామి క్లబ్ ద్వారా వస్తున్న జీతంతో పాటు అడిడాస్, మిచేలోబ్ అల్ట్రా వంటి పెద్ద బ్రాండ్ల ప్రచారకర్తగా మెస్సీ దూసుకుపోతున్నాడు.

### కుర్రాళ్ల గట్టి పోటీ

సీనియర్లకు భవిష్యత్తు తరం ఆటగాళ్లు గట్టి పోటీ ఇస్తున్నారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన 27 ఏళ్ల కిలియన్ ఎంబాప్పే మొత్తం 794 కోట్ల రూపాయలతో మూడో స్థానాన్ని ఆక్రమించాడు. ఆయన మైదానంలో 585 కోట్లు, ప్రకటనల ద్వారా 209 కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాడు. అలాగే నార్వేకు చెందిన 25ఏళ్ల ఎర్లింగ్ హాలాండ్ 668కోట్ల రూపాయల సంపాదనతో నాలుగో స్థానంలో ఉన్నాడు.హాలాండ్ మైదానంలో 501కోట్లు, ప్రకటనల ద్వారా 167కోట్ల రూపాయలు సంపాదిస్తున్నాడు.

### స్టార్ల నోట్ల వేట

బ్రెజిల్ దేశానికి చెందిన 25 ఏళ్ల యువ స్టార్ వినిసియస్ జూనియర్ మొత్తం 501 కోట్ల రూపాయల ఆదాయంతో ఐదో స్థానంలో నిలిచాడు. ఇందులో మైదానంలో ఆట ద్వారా 334 కోట్లు, ప్రకటనల ద్వారా 167 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఈయన తర్వాత ఈజిప్ట్ దేశానికి చెందిన 33 ఏళ్ల మహ్మద్ సలా 460 కోట్ల రూపాయల సంపాదనతో ఆరో స్థానంలో నిలవగా, సెనెగల్ దేశానికి చెందిన 34 ఏళ్ల సాడియో మానే 451 కోట్ల రూపాయల సంపాదనతో ఏడో స్థానంలో నిలిచాడు. సలా మైదానంలో 293 కోట్లు, బయట 167 కోట్లు సంపాదిస్తుండగా, మానే మైదానంలో 418 కోట్లు, బయట 34 కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాడు.

### చిన్న వయసులోనే వందల కోట్లు

ఇంగ్లాండ్ జట్టుకు ఆడుతున్న 22 ఏళ్ల జూడ్ బెల్లింగ్‌హామ్ మొత్తం 368 కోట్ల రూపాయల ఆదాయంతో ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. ఆయన మైదానంలో 243 కోట్లు, ప్రకటనల ద్వారా 125 కోట్ల రూపాయలు వెనకేస్తున్నాడు. ఇక ఈ లిస్టు మొత్తంలో అందరికంటే చిన్న వయస్కుడైన స్పెయిన్ దేశపు 18 ఏళ్ల లామిన్ యమాల్ అందరినీ ఆశ్చర్యపరుస్తూ 360 కోట్ల రూపాయల సంపాదనతో తొమ్మిదో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ వయసులోనే ఆయన మైదానంలో 276 కోట్లు సంపాదిస్తుండగా, కోకాకోలా, మెక్‌డొనాల్డ్స్, వీసా వంటి ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్ల ప్రకటనల ద్వారా ఏకంగా 83 కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నాడు.

### ఆఖరి స్థానాల్లో కేన్, నేమార్

ఇంగ్లాండ్ జట్టుకు ఆడుతూ జర్మనీ బుండెస్లిగా లీగ్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న హ్యారీ కేన్ 32 ఏళ్ల వయసులో మొత్తం 343 కోట్ల రూపాయల ఆదాయంతో పదో స్థానంలో ఉన్నాడు. ఆయన మైదానంలో 243 కోట్లు, ప్రకటనల ద్వారా 100 కోట్లు రూపాయలు ఆర్జిస్తున్నాడు. ఇక బ్రెజిల్ స్టార్ నేమార్ 318 కోట్ల రూపాయల సంపాదనతో ఈ టాప్ 11 జాబితాలో చివరి స్థానంలో నిలిచాడు.